క్లుప్తంగా

విద్యలో రాణించడం అభినందనీయం



తెనాలిఅర్బన్: విద్యలో ప్రతిభ చూపి పలువురికి ఆదర్శంగా నిలవడం అభినందనీయమని ప్రముఖ సీనియర్ న్యాయవాది పొన్నం విజయ్‌కుమార్, పూర్వ విద్యార్థుల సంఘ వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్‌లు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం సన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణ



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని అసిస్టెంట్ మలేరియా అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌ల శిక్షణ కార్యక్రమం శనివారంతో రెండో రోజుకు చేరింది. ముఖ్య అతిథిగా జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పాల్గొని పలు సూచనలు చేశారు. మైక్రోస్కోప్ ద్వారా మలేరియా వ్యాధి కారక క్రిమిని, మలేరియాలోని వివిధ రకాలను ఎలా గుర్తించవచ్చో వివరించారు. కార్యక్రమంలో గుంటూరు ల్యాబ్ టెక్నీషియన్స్ శ్రీ విద్య, ధనలక్ష్మి, సుధీర్, కమలాకర్ గుప్తా, శివకృష్ణ, గంగారెడ్డి పాల్గొన్నారు.

గోవర్ధన స్వామి ఆలయంలో కల్యాణం



తెనాలిరూరల్: జ్యేష్ఠ పౌర్ణమి, ఏరువాక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ గోవర్ధన స్వామి దేవస్థానంలో వార్షిక శాంతి కల్యాణాన్ని శనివారం నిర్వహించారు. కాకుమాను శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని వైఖానస ఆగమ పండితులు వేదాంతం మాధవ్ కుమార్, అర్చకులు టి.రఘు, టి.యశ్వంత్, టి.మోహన వంశీ, వేదాంతం కేశవ్ కుమార్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్‌వీఎన్ మల్లేశ్వరి పర్యవేక్షించారు. కల్యాణోత్సవంలో కొల్లూరి శ్రీహరి, జ్యోతిర్మయి దంపతులు కొల్లూరు మల్లికార్జునరావు, కాకుమాను తారానాథ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

నేడు అగ్ని ప్రమాద బాధితుల సమావేశం

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాలలో జనవరి 19వ తేదీన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో నష్టపోయిన బాధిత రైతుల సమావేశం ఈనెల 23వ తేదీ నిర్వహించనున్నట్లు పసుపురైతు సంఘం కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు, ఇతర పంటలను భద్రపరచుకుని నష్టపోయిన బాధిత రైతుల సమావేశం నేడు ఉదయం 10 గంటలకు దుగ్గిరాల రైలుపేటలోని టర్మరిక్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించనున్నామని బాధిత పసుపు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

తులసి అలంకారంలో స్వామి దర్శనం



నగరంపాలెం: లాలాపేటలోని శ్రీపద్మావతి ఆండాళ్ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పలు పూజలు నిర్వహించారు. స్వామికి తులసి అలంకారం చేశారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఉదయం నిత్యహోమం బలిహరణ, వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతితో పాటు ధ్వజావరోహణ, మూగబలి, శేషవాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో శ్రీజగన్నాథ, శ్రీఆంజనేయ, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు ఆర్.టి.ఆర్.వి.ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయండి

- అధికారులు విధుల పట్ల అంకిత భావంతో ఉండాలి
- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- కొల్లిపరలో మండల స్థాయి అధికారులతో సమీక్ష



కొల్లిపరలో అధికారులకు సూచనలిస్తున్న మంత్రి మనోహర్

కొల్లిపర: ప్రజా ప్రతినిధులు, అధికారులు పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో శనివారం రాత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ అధ్యక్షత వహించారు. సమావేశంలో వివిధ శాఖల నివేదికల ఆధారంగా పురోగతిపై చర్చించారు. అభివృద్ధి పనులు ఏ దశలో ఉన్నాయో అడిగి తెసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రూ.40 లక్షలతో ఇరిగేషన్, ఎన్‌జీఎస్, వ్యవసాయాధికారులు అంతా కలసికట్టుగా ఉండి రానున్న 15 రోజులల్లో ప్రతి గ్రామంలోని పంట కాలువలు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి సాగు నీరు సక్రమంగా రైతులకు అందేలా కృషి చేయాలని ఆదేశించారు.

ప్రతి రైతు ఆధునిక వ్యవసాయం చేసేలా వారికి అధికారులు నూతన యంత్రాలు అందించి వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని ఆదేశించారు. 10 సంవత్సరాల క్రితం తాను తెనాలి శాసన సభ్యుడిగా ఉన్నప్పుడు కొల్లిపర మండలంలో 1200 డ్వాక్రా మహిళా గ్రూపులు ఉండేవని ప్రస్తుతం 1400 గ్రూపులు ఉన్నాయి అని చెప్పటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు. ఏపీఎంలు గ్రూపులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి గ్రూపులు పెరిగే విధంగా చూడటమే కాకుండా మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ అధికారులు మరో 10 రోజులలో ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఏజీఎల్ విద్యుత్ కనెక్షన్లు వెంటనే అందించాలన్నారు.

గత ప్రభుత్వం పేదలకు అందించిన ఇళ్ల స్థలాల వివరాలు వెంటనే అందించాలని తహసీల్దారును కోరారు. ఉపాధి, రోడ్ల పనులను వెంటనే నిలిపి వేయాలని వాటిని పరిశీలించిన తరువాత మాత్రమే పనులు ప్రారంభించటం జరుగుతుందన్నారు. రేషన్ కార్డులు, దీపం పథకం ద్వారా అందిస్తున్న గ్యాస్ కనెక్షన్‌లు కావాల్సిన వారి దగ్గర నుంచి సమాచారం తీసుకుని వెంటనే ఆ పనులు కూడా ప్రారంభించాలని తహసీల్దారుకు ఆదేశించారు. ప్రతి నెల గ్రామంలో రేషన్ పంపిణీ జరిగే సమయంలో పంచాయతీ కార్యదర్శులు స్వయంగా పరిశీలించి తుది నివేదిక తనకి అందించాలన్నారు. మండల వైద్యాధికారులు జులై నెలలో ఎక్కువగా జనాభా ఉన్న గ్రామాన్ని ఎంచుకొని ప్రైవేటు హాస్పటల్ యాజమాన్యంతో కలసి మెడికల్ క్యాంపు నిర్వహించాలని, క్యాంపుకు కావాల్సిన అన్ని సదుపాయాలు ప్రభుత్వం నుంచి అందించటం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఇక నుంచి మండల స్థాయి అధికారులతో తాను ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ విధంగా సమీక్ష సమావేశం నిర్వహిస్తానని, ఏ అధికారి అయినా విధులు సక్రమంగా నిర్వహించక పోతే అటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. తొలుత మనోహర్‌కు అత్తోట, దావులూరు అడ్డ రోడ్డు, కొల్లిపరలో పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, తహసీల్దారు శ్రీనివాసులు, పరిపాల ఏవో చంద్రమోహన్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులు వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో జరుగుతున్న రక్షిత మంచినీటి పథకం మోటారు మరమ్మతుల పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. వీఎస్సార్ కళాశాల సమీపంలోని పైకాస్ పార్కులో శనివారం చేపట్టిన హెడ్ వాటార్ వర్క్‌ను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని 3,7 వార్డులలో మంచినీటి సరఫరా ఉండదని ప్రజలంతా సహకరించాలన్నారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డును పరిశీలించారు. ఎక్కడా వ్యర్థాలు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, డీఈ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

తెనాలిలో ఎంటమలాజికల్ సర్వే

హాజరైన గుంటూరు జోనల్ మలేరియా అధికారి వీర్రాజు



సర్వే వివరాలు పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ వీర్రాజు

తెనాలిఅర్బన్: దోమలలోని రకాలను తెలుసుకునేందుకు శనివారం తెనాలి ఇందిరానగర్ కాలనీలో ఎంటమలాజికల్ సర్వే నిర్వహించినట్లు గుంటూరు జోనల్ మలేరియా కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ గొల్ల వీర్రాజు పేర్కొన్నారు. శనివారం తెనాలి వచ్చిన ఆయన ఇందిరా కాలనీలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. అనంతరం తెనాలిలోని మలేరియా కార్యాలయంలో సర్వే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల్లోని రకాలు, వాటి ద్వారా సంక్రమించే వ్యాధులపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. లార్వాలు పెరుగుటకు అవకాశం ఉన్న మూలాలను తొలగించడం జరిగిందన్నారు. అనంతరం అక్కడ మలేరియా మాసోత్సవాల అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అండె బాలచంద్రమౌళి, సబ్‌యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, కోడెల శ్రీనివాసరావు, బుస్సా సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అతిసారం నియంత్రణకు చర్యలు చేపట్టండి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: అతిసార వ్యాధి ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నలు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం హెల్త్ సెక్రటరీ, శానిటరీ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు, ఎనిమిటీలు, మహిళా పోలీసులు, ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెనాలి పట్టణంలో డయేరియాతో ఏఒక్కరూ మరణించకుండా చూడాలన్నారు. డయేరియాపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. నీళ్ల విరోచనాలు ఎక్కువగా అవుతూ ఉంటే వెంటనే వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. భోజనానికి ముందు, మల విసర్జన తరువాత చేతులు శుభ్రపరచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ మంచి నీటిని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ఇంట్లో పరిశుభ్ర వాతావరణం ఉండే విధంగా చూడాలన్నారు. చెత్తను రోడ్లపై, ఇంటి పరిసరాల్లో వేయకుండా పురపాలక సిబ్బందికి అందించాలని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అతిసార వ్యాధి నివారణకు నియమించిన బృందాలు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామి కల్యాణానికి పట్టువస్త్రాలతో వస్తున్న భక్తులు

నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎన్ కాలనీలోని శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఉదయం వేద పండితులు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహం, అగ్ని ధ్యానం, నిత్య హోమం, శ్రీ వెంకటేశ్వర మూలమంత్ర హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు అనంతరం బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు చండీ యాగం, సువాసిని పూజల్ని భక్తిప్రపత్తులతో చేపట్టారు. ఉపన్యాస భారతి, విశ్రాంత ఉపాధ్యాయిని ఎం.వి. సత్యవతి లలితా సహస్ర నామం జరిగింది. సాయంత్రం శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దివ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై, స్వామి కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమాల్ని కార్యదర్శి నల్లమోతు వెంకటరత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకట మల్లేశ్వర్, ఉపాధ్యక్షులు పావులూరి కిశోర్, సంయుక్త కార్యదర్శి ఇమ్మడి శ్రీనివాసరావు, నైషధం శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర సమాజం

- గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు
- కొలకలూరులో ఘనంగా ఏరువాక పౌర్ణమి



ఏరువాక పౌర్ణమిలో రైతులు, జిల్లా అధికారులు

తెనాలి: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం 'ఆదిత్య నందన వనం' ఆధ్వర్యంలో శనివారం ఏరువాక పౌర్ణమి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారులు, రైతులు, సిబ్బంది పాల్గొని నాగలితో భూమిని దున్ని వరి విత్తనాలను వెదజల్లారు. ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. అందుచేత రైతులంతా సంఘటితమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను అందుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించటం ద్వారా నేలతల్లి ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చని అదే సమయంలో ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తులను సమాజానికి అందించవచ్చని చెప్పారు. దేశవాళీ వరి సాగును రైతులు అలవరచుకుంటే మరిన్ని ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రతి అనారోగ్యానికి ఒక ప్రత్యేక రకం దేశవాళీ వరి రకం ఉన్నట్టు చెప్పారు. ఆహారంతోనే ఆరోగ్యాన్ని మనం సంరక్షించుకోవచ్చునని అన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా రైతుకు వ్యవసాయం గిట్టుబాటు కావడంతో పాటు ప్రజలందరికీ మంచి ఆరోగ్యం సమకూరుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు రాజకుమారి మాట్లాడుతూ సంప్రదాయబద్ధంగా ఏరువాక పౌర్ణమితో వ్యవసాయానికి నాంది పలుకుతామని ఆ ఆనవాయితీ ప్రకారం ఏరువాక పౌర్ణమి మహోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆదిత్య నందనవనం అధ్యక్షులు యర్రంశెట్టి హనుమంతరావు అధ్యక్షత వహించారు. భారతీయ సంస్కృతిలో వ్యవసాయం రైతుకు జీవన విధానమని అన్నారు. తెలుగువారికి ఉగాది పండుగలా వ్యవసాయానికి ఏరువాక పౌర్ణమి తొలి పండుగని అన్నారు. రైతులకు, ప్రజలకు వారధిగా ఆదిత్య నందనవనం నిలుస్తుందని చెప్పారు. వ్యవసాయశాఖ ఏడీఏ ఉషారాణి, మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్, ఏఈవో జి.మోహన్, వీఏఏలు నాగరాజు, నాగేంద్ర, వంశీ, ఆదర్శ రైతులు బాపయ్య రామకష్ణ తదితరులు పాల్గొన్నారు ఎస్‌ఎఫ్ఏ సుమ, ఎఫ్‌పీఓ సభ్యులు, సీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు. దూళ్ల నరసింహారావు ఏరువాక సాగగా అంబటి మారుతి వరప్రసాద్ వందన సమర్పణ చేశారు

ఆధునిక వైద్య విధానంపై అవగాహన



మెదడు వైద్యం గురించి వివరిస్తున్న డాక్టర్ సౌమ్య

తెనాలిరూరల్: స్థానిక బోసురోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ జె.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుంటూరు శ్రేష్ఠ హాస్పటల్స్‌కు చెందిన వైద్యులు డాక్టర్ జి.నాగార్జున డాక్టర్ ఎం.సౌమ్య పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు. ముఖ్యంగా గుండె, మెదడుకు సంబంధించి ఆధునిక వైద్య విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ పావని ప్రియాంక పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఐఎంఏ కోశాధికారి డాక్టర్ కె శ్యామ్ ప్రసాద్, సహాయ కార్యదర్శి డాక్టర్ జి మధు ప్రభాకరబాబు, డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ జి నరసింహారావు, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ విజయవాణి, డాక్టర్ శ్రీ విద్య తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో నిడుబ్రోలు బ్రిడ్జి

- అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు



వీధిలైట్లు వెలగక అంధకారంగా ఉన్న నిడుబ్రోలు బ్రిడ్జి

పొన్నూరు: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేక వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మరమ్మతులకు గురైన వీధి లైట్లకు సకాలంలో మరమ్మతులు చేయక సమస్య మరింత జటిలంగా మారుతోంది. దీంతో రాత్రిళ్లు అంధకారంగా ఉన్న రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు గుంతల రహదారులు, అందులోనూ చిమ్మ చీకటితో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకట్లో వెళ్లేందుకు వెనుకంజ వేస్తున్నారు. ప్రధానంగా నిడుబ్రోలు బ్రిడ్జిపై పరిస్థితి అధ్వానంగా ఉంది. బ్రిడ్జిపై ఉన్న వీధిలైట్లు పూర్తిస్థాయిలో వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో జరిగిన బైక్ ప్రమాదంలో పలువురు గాయాలపాలయ్యారు. అంధకారమే ప్రమాదానికి ముఖ్య కారణమని వాహనదారులు చెబుతున్నారు. వీధిలైట్ల సమస్యపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని పట్టణ వాసులు చెబుతున్నారు. వెంటనే నిడుబ్రోలు బ్రిడ్జిపై లైట్లకు మరమ్మత్తులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదానికి గురయిన వాహనదారుని వద్ద గుమిగూడిన ప్రజలు



నిడుబ్రోలు బ్రిడ్జిపై వెలగని వీధి లైటు

కరుణించిన వరుణుడు



తాడికొండ: గత వారం రోజులుగా ఎండలతో అల్లాడిన జనాలకు శనివారం వరుణదేవుడు కరుణ చూపాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడి ఎక్కువగా ఉండి బలమైన గాలులు వీచడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి చల్లటి గాలులతో పాటు చిరుజల్లులు ప్రారంభమై వర్షం కురిసింది.

డివైడర్‌ను ఢీకొన్న లారీ



ఫిరంగిపురం: లోడుతో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన గుంటూరు–కర్నూలు రాష్ట్ర రహదారిపై మండలకేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా నంద్యాల నుంచి చేపలమేతతో రాజమహేంద్రవరం వెళ్తున్న లారీ ఫిరంగిపురంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ సుబ్బయ్యకు స్వల్ప గాయాలు కాగా లారీ ముందు భాగం దెబ్బతింది. రాత్రి సమయంలో డివైడర్ కనిపించకపోవడంతో ఢీ కొట్టినట్లు లారీ డ్రైవర్ తెలిపాడు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ కాలనీకి చెందిన 17 సంవత్సరాల బాలిక శుక్రవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనరల్ నోటీసు

IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE::TENALI

I.P. No. 16/2024

Between :
Kowtharapu Veera Venkata Rao -Petitioner
And
1. **Mallela Kavitha** W/o Srinivasa Rao, D.No. 19-2-16 Muttemsetty vari palem, Tenali.
2. **Chivukula Subrahmanyam,** S/o Markandeyulu, D.No. 20-288, Chinaravuru, Tenali.
3. **Chivukula Sai Mounika,** W/o Subrahmanyam, D.No. 20-288, Chinaravuru, Tenali. - Respondents

పై నెంబరు ఐ.పి.లో పిటీషనరు తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పిటీషను దాఖలు చేయగా, సదరు పిటీషనుపై ఎవరికైనా అభ్యంతరములు వుంటే తెలుపుకోమని శ్రీ కోర్టువారు జనరల్ నోటీసుకు ఆర్డరు వేస్తూ మీ హాజరు నిమిత్తము ది.2-7-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10-30 గం॥లకు మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటీషనును మీ పరోక్షమున విచారించి, తీర్మానించబడునని యావన్మందికి తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుతో)

వాయిదా: 2-7-2024

ఎం.పి. భీమేశ్వర్
పిటీసర్ తరుపు అడ్వకేట్, తెనాలి
సెల్ నెం. 91333 31157

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఫిరంగిపురం: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ మహబూబ్‌సుభాని అన్నారు. మండల కేంద్రంలోని ప్రకాశం పంతులునగర్‌లో శనివారం పిల్లలు బడిలో చేర్పించాలని వారి తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ బడివయస్సు వచ్చిన వారిని తప్పనిసరిగా సమీపంలోని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. వలస వచ్చిన వారిని కూడా గుర్తించి పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేర్చుకోవాలని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

178 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 178మందికి వైద్యాధి కారి శ్వేత పరీక్షలు చేసి మందులు అందజేశా రు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి పాల్గొన్నారు.

కాపు అభ్యర్థులకు రిజర్వేషన్లు కల్పించాలి

పొన్నూరు: ప్రభుత్వం ప్రకటించనున్న డీఎస్సీలో కాపు అభ్యర్థులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. డీఎస్సీలో కాపు అభ్యర్థులకు మేలు జరిగేలా చేయాలని కోరారు. గతంలో చంద్రబాబు రాష్ట్రంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విధంగా చర్యలు చేపట్టారని, అనంతరం ప్రభుత్వం మారటంతో ఆ అంశం మరుగున పడిందని తెలిపారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని రాష్ట్రంలో అధికంగా ఉన్న కాపు, ఉపకులాలకు రిజర్వేషన్లు అమలయ్యేలా చట్టం చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నుంచే ఈ రేజర్వేషన్లు అమలుచేయాలని కోరారు.